



వేగేశ్న రామరాజు

# ఒక నగరం - ఒక రైతు
# ఆకుపచ్చ ప్రేమకథ

అందాలకోసం ఆవరణంలో ఉండే చెట్లను నరికి.. చక్కని ఆర్కిటెక్చర్‌తో నిర్మాణం చేపట్టి .. అద్భుతమైన ఇంటీరియర్‌తో అలంకరించే రోజుల్లో పచ్చదనానికి చోటుందంటారా? అంటే ఎందుకుండదు. కొందరు మహానుభావులు ఉంటారు! నడిచివచ్చిన దారిని మరిచిపోని బాటసారులు ఉంటారు. పల్లెలో పుట్టి పచ్చని చెట్లమధ్యే పెరిగిన ఓ పల్లె ప్రేమికుడు కాంక్రీటు కీకారాణ్యంలో ఓ అరణ్యాన్నే పెంచుతున్నాడు! పల్లెమీద ప్రేమతో టెర్రస్‌పై అడవిలాంటి వనాన్ని, జీవజాతులకు ఆవాసాన్ని కల్పించిన 'ఒక నగరం - ఒక రైతు ప్రేమకథ' ఇది!



బీయెస్సీ పూర్తయిన తర్వాత వివిధ వృత్తులు చేస్తూ చివరికి నాగార్జున సిమెంట్‌లో ప్లాంట్ ఇన్‌చార్జ్ ఉద్యోగంలో చేరాడు వేగేశ్న రామరాజు. కొంతకాలం తర్వాత నగరానికి వచ్చి స్థిరపడ్డారు. ఒక చిన్న ఇంట్లో కుటుంబంతో అద్దెకు దిగారు. సిమెంటు గోడలే పరిసరాలైన ఆ ఇంట్లో ఆయన అడుగు పెట్టిన వెంటనే రకరకాల మొక్కలూ అడుగుపెట్టి, వేళ్లూనుకున్నాయి. పసిపిల్లల్ని కాపాడుకున్నట్టు ప్రేమగా మొక్కలను పెంచారు. ఆయన ప్రేమపంట మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతూ వంటింటి అవసరాలు తీర్చింది. నీరు పోసిన చేతికి ఫల'సాయం' చేయడమే తెలిసిన మొక్కలు కమ్మని కూరలు, తియ్యని ఫలాలు ఇచ్చాయి. చూపులకు ఆహ్లాదం పంచుతూ, కమ్మని రుచులతో ఆనందపరిచే ఆ ఇంటిపంటకు, ఈ పట్నం రైతు కుటుంబానికి అనుబంధం పెరిగింది.



### పుట్టింటి నుంచి మెట్టినింటికి!

రామరాజు కొన్నాళ్లకు సొంతిల్లు కట్టుకోవాలనుకున్నాడు. హైదరాబాద్ వెంగళరావునగర్‌లో తోడల్లుడితో కలిసి స్థలం కొనుక్కున్నాడు. 19 సంవత్సరాల కిందట రెండంతస్తులతో ఇల్లు నిర్మించుకున్నారు. పై అంతస్తులో రామరాజు కుటుంబం, కింది అంతస్తులో తోడల్లుడి కుటుంబం కాపురం పెట్టాయి. ఈ పట్నం రైతు తన ఫ్యామిలీ మెంబర్స్ అయిన మొక్కల్నీ కొత్తింటికి తీసుకొచ్చాడు. పంపకాల్లో భాగంగా సెల్లార్ తనకు, టెర్రస్ తోడల్లుడికి సొంతమైంది. కాలంతోపాటే వస్తున్న ఆర్థిక మార్పులు వాళ్లనూ మార్చేశాయి. మనిషికో కారు రావడంతో పార్కింగ్‌కు మొక్కలు అడ్డయ్యాయి. ప్రేమతో